## క్లుప్తంగా

### కాలువ పనులు త్వరగా పూర్తి చేయండి



కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**పెద్దపప్పూరు:** వరద కాలువ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని నామనాంకపల్లి గ్రామ సమీపంలో చాగల్లు రిజర్వాయర్ నుంచి కొండాపురం వరకు జరుగుతున్న వరద కాలువ పనులను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు కాలువ నిర్మాణం పనులు ఎంతమేర చేశారన్న విషయాన్ని హెచ్చెల్సీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### హైఓల్టేజీతో కాలిన పరికరాలు

**గుత్తి రూరల్:** పట్టణంలోని ఉప్పర వీధిలో బుధవారం హైఓల్టేజీతో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. బాధితులు తెలిపిన వివరాలు.. ఉప్పర వీధిలోని సుమారు 20కు పైగా ఇళ్లలో బుధవారం ఉదయం ఒక్కసారిగా హైఓల్టేజీ రావడంతో ఫ్యాన్లు, టీవీ, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. ఉప్పర వీధిలో 15 రోజులలో గృహాలకు హైఓల్టేజ్ రావడం ఇది రెండో సారి అని బాధిత మహిళలు అరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

### 16న కంటి వైద్య శిబిరం

**గుత్తి రూరల్:** పట్టణంలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో ఈ నెల 16న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు ప్రైవేటు ఆస్పత్రి వారు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకూ వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పరీక్షలు నిర్వహించి, కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు.

### వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రామకృష్ణ

**గుత్తి రూరల్:** పట్టణ శివార్లలోని మాసినేని పాఠశాల వద్ద బుధవారం బైక్‌పై నుంచి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని బండగేరికి చెందిన రామకృష్ణ పామిడిలోని ఓ జాతీయ బ్యాంకులో విధులు నిర్వర్తించేవాడు. బుధవారం ఉదయం పామిడికి విధులకు వెళ్తున్న క్రమంలో పట్టణ శివార్లలోని మాసినేని పాఠశాల వద్ద రోడ్డుపై పంది అడ్డు వచ్చింది. దీంతో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**చిన్నారికి..**

**గుత్తి రూరల్:** మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో బుధవారం ఇంటి బయట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడి రెండేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నరేష్, స్వాతి దంపతుల కుమారుడు మోక్షిత్ ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో తల్లిదండ్రులు వెంటనే చిన్నారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### వ్యక్తి మృతి

**గుత్తి రూరల్:** మండలంలోని మాముదూరులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రామాంజనేయులు బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు అనారోగ్యంతో ఈ నెల 7న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో రామాంజనేయులు అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు చేశారు.

### అవ్వాతాతలకు కంటి వెలుగు వరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మధుసూదన రాజు

**పెద్దపప్పూరు:** అవ్వాతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ఓ వరమని తాడిపత్రి నియోజకవర్గ నేత్ర వైద్యాధికారి మధుసూదన రాజు అన్నారు. బుధవారం సోమనపల్లిలో కంటి వైద్యశిబిరం నిర్వహించి 32 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నకంబయ్య, ఆరోగ్య కార్యకర్త నాగరత్నమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం



డ్వాక్రా మహిళాలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

• ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

**గుంతకల్లు:** సంక్షేమ పథకాల అమలులో మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెలగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద మండలంలోని 816 స్వయం సహాయక సంఘాల్లోని 8,160 మంది మహిళలకు రూ.6.14 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే ఎంపీపీ బీ.మాధవితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి థ్యాంకు సీఎం సార్ అంటూ నినదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం 98 శాతంపైగా అమలు చేసిందన్నారు. మహిళలను లక్షాధికారులను చేయడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. మహిళా సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేసున్న సీఎం జగన్‌ను అక్కచెల్లమ్మలు ఆశీర్వదించాలని కోరారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మోసగించారన్నారు. తమ ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేశామన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలు చూసి నారా లోకేష్ పాదయాత్రలో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులను జన్మభూమి కమిటీల ద్వారా అందేవని, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని స్పష్టం చేశారు. సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో గుక్కెడి తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గెలిచిన వెంటనే రూ.10 లక్షలు కేటాయించి సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక వ్యవసాయ మోటర్లు ఆడడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన వెంటనే గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయించారన్నారు. వైస్ ఎంపీపీ సీ.ప్రభావతి, జెడ్పీటీసీ కదిరప్ప, సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, వైస్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీ.మోహన్, మాజీ ఎంపీటీసీ పాటిల్ జయరామిరెడ్డి, సింగిల్ విండో ప్రెసెడెంట్ సుంకిరెడ్డి, వివిధ గ్రామల సర్పంచులు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన జయప్రదం చేద్దాం



యల్లనూరులో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

**యల్లనూరు:** నార్పలలో ఈనెల 17న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యల్లనూరు మండలంలో ప్రతి గ్రామం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు పెద్దఓబులమ్మ, నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు తిమోతి, సచివాలయ కన్వీనర్లు కిరణ్, జాఫర్, చాంద్‌బాష, నాయకులు, సూర్యనారాయణరెడ్డి, బాలవెంకటరెడ్డి, పెద్దిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శివనాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు:** ఈనెల 17న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేద్దామని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ రాఘవరెడ్డి నివాసంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్పలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. ఎంపీపీ రాఘవరెడ్డి, ఎంపీటీసీ భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, సర్పంచు రామకృష్ణారెడ్డి, నాయకులు మహేశ్వరరెడ్డి, రవి, న్యాయవాది భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న పంట దగ్ధం

**పుట్లూరు:** మండలంలోని అరకటివేముల గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు రెండు ఎకరాలలో పండించిన మొక్కజొన్న కంకులు దగ్ధమైయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. అరకటివేములలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రామాంజినేయులు అనే రైతు రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంట కాలం ముగిసిన అనంతరం కంకులను కోసి కుప్ప పోసి ఉంచాడు. బుధవారం గట్టు ద్వారా మంటలు వ్యాపించాయి. పంట మొత్తం దగ్ధం కావడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని రైతు కన్నీటిపర్యంతమయ్యాడు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



సంక్షేమ పథకాల గురించి వృద్ధుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిపత్రి టౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న విద్యా కానుక వంటి కార్యక్రమాలు అమలు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల గుండెలో నిలిచారన్నారు. స్థానిక 15వ వార్డు పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాబు డాక్టర్ వీధిలో ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు స్వాగతం పలికారు. వార్డు నాయకులు పక్కీరప్ప, నాగాంజనేయులు(ఆంజి)తో కలిసి ఎమ్మెల్యే అంబేడ్కర్ నగర్‌లోని ఇంటింటికీ తిరిగి అందరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడం ద్వారా జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఎమ్మెల్యే వెంట సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కంచెం రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు రాఘవేంద్ర, చిన్ననాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, నాయకులు విజయ్‌కుమార్, పాపరాయుడు, కంబగిరి, రామాంజనేయులు, శివ మహేష్, బాబయ్య, దివాకర్, గడ్డం గణేష్, మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక టిప్పర్ల సీజ్



స్వాధీనం చేసుకున్న టిప్పర్లతో సెబ్ సిబ్బంది

**తాడిపత్రి అర్బన్:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం తెల్లవారుజామున సెబ్ అధికారులు సీజ్ చేశారు. సెబ్ అధికారి విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి బుధవారం తెల్లవారుజామున సజ్జలదిన్నెలోని ఆలూరు క్రాస్ వద్ద ఏపీ04 టీటీ 8552, ఏపీ05 టీజీ 2545 టిప్పర్లను ఆపి తనిఖీ చేయగా అందులో ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అయితే ఇసుక రవాణాకు అనుమతి లేకపోవడంతో టిప్పర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లు గురుస్వామి, మహ్మద్ ఇర్ఫాన్‌తో పాటు క్లీనర్లు విశ్వనాథ్, నాగార్జునను అరెస్ట్ చేశారు.

### గడ్డివామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న దృశ్యం

**పెద్దవడుగూరు:** రావులుడికి గ్రామంలో బుధవారం హరిజన కంబన్న అనే రైతుకు చెందిన గడ్డివామి అగ్నికి ఆహుతి అయింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామంలోకి దట్టమైన పొగలు రావడంతో ప్రజలు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డి వామి కాలిపోయింది. ఘటనలో సుమారుగా రూ.లక్ష దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

# ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు



వృద్ధుడికి సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

**గార్లదిన్నె:** రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ,బీసీ కాలనీల్లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో వివరించారు. కాలనీలో డ్రైనేజీ సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యేకు విన్నవించగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే ఇళ్లు మంజూరు కావాలని ప్రజలు అడుగగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు. వాటితో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామ సచివాలయాలు ద్వారా అర్హులైన ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు అందించేలా చర్యలు చేపట్టారన్నారు. ఏదైనా కారణాల వల్ల సంక్షేమ పథకాలు రాకపోయినా వాటిని పరిశీలించి, అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామోహ్మన్‌రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ పరంధామ, ఎస్సీసెల్ మండలాధ్యక్షులడు లక్ష్మీనారాయణ ,ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ విజయభాస్కర్‌రావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన మేకల సురేష్‌బాబు నెలరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ప్రభుత్వం మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.5 లక్షల పరిహారం మంజూరు చేసింది. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మృతుడి భార్య అనితకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈసందర్భంగా సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌కు సురేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏఎస్‌ఐ లూకయ్యకు ఘన నివాళి



ఏఎస్‌ఐ లూకయ్యకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**గుత్తి రూరల్:** గుత్తి పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన లూకయ్యకు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ లూకయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు అంజన ప్రసాద్, సుధాకర్‌నాయుడు, రాందాసులు మాట్లాడుతూ ఏఎస్‌ఐ లూకయ్య నిత్యం గాంధీచౌక్‌లో విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తినా నవ్వుతూనే వాటిని పరిష్కరించేవారన్నారు. అభాగ్యులు, నిరుపేదలకు సాయం చేస్తూ ఏఎస్‌ఐ అందరి మన్ననలు పొందారని అన్నారు. ప్రజా సంఘాల నాయకులు పూలమాబు, మోహన్‌దాస్, బేతాపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలి




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**బుక్కరాయసముద్రం:** రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలని శాస్త్రవేత్తలకు పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి, విస్తరణా సంచాలకులు సుబ్బరామిరెడ్డి సూచించారు. బుధవారం రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ప్రశాంతి, సుబ్బరామిరెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నూతన టెక్నాలజీను రైతులకు పరిచయం చేయాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడినిచ్చే విత్తన వంగడాలను రైతులకు అందించాలన్నారు. మహిళా రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తుల మీద శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం వ్యవసాయ పనిముట్లను పరిశీలించి, వివిధ పంటల సాగుపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యవసాయ అధికారులు చంద్రానాయక్, వైవీ సుబ్బారావు, మోహన్‌రావు, వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, రేకులకుంట, రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

### ఖాతా నుంచి రూ. 20 వేలు మాయం

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** ఆధార్ లింకేజీ ఆధారంగా ఓ మహిళ ఖాతాలోని రూ.20 వేలను సైబర్ నేరగాళ్లు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని జేఎన్‌టీయూ సమీపంలో ఉన్న లక్ష్మి ఆర్కేడీ అపార్టుమెంటులో నివాసముంటున్న సుమంగళికి సాయినగర్‌లోని ఎస్‌బీఐ ప్రధాన శాఖలో ఖాతా ఉంది. బుధవారం ఉదయం నగదు కోసం బ్యాంక్‌కు వెళ్లిన ఆమె... తన ఖాతాలో రూ.20 వేలు మాయమైనట్లు గుర్తించి, ఆరా తీసింది. పరిశీలించిన బ్యాంక్ అధికారులు మంగళవారం సాయంత్రం రూ.10వేలు, బుధవారం ఉదయం రూ.10వేలను ఆధార్ నంబర్ ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తులు కాజేసినట్లు వివరించారు. ఇటీవల ఎక్కడైన ఫింగర్ ప్రింట్‌లు వేశారా? అని బ్యాంక్ అధికారులు అడగడంతో 2021, మార్చిలో ఓ సైటు కొనుగోలు సమయంలో రిజిస్టర్ కార్యాలయంలో వేలి ముద్రవేసినట్లు ఆమె తెలిపింది. దీంతో బ్యాంక్ అధికారుల సూచన మేరకు 1930కు, వన్‌టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

### భూమికి పచ్చాని రంగేసినట్టు!



**యల్లనూరు:** పచ్చని పంటలు...ఆహ్లాదకర వాతావరణం.. ఈ దృశ్యాన్ని చూసి ఇది కోనసీమ అనుకుంటే పప్పులో కాలేసినట్లే..యల్లనూరులోని వరి పంట దృశ్యాలు ఇవి.. భూమికి పచ్చాని రంగేసినట్టు..కోన సీమ అందాలను యల్లనూరులో చూస్తున్నట్లుంది కదూ.. పచ్చని పంటల నడుమ రహదారిలో వెళుతుంటే ఊటీలో వెళ్లినట్లు ఉందని వాహనదారులు, పాదచారులు అంటున్నారు. మండల వ్యాప్తంగా వేసవిలో 400 ఎకరాల్లో సాగు చేసినట్లు ఏఓ రామకృష్ణుడు తెలిపారు.

### బెటాలియన్‌లో క్యాంటీన్ ఏర్పాటు



క్యాంటీన్ ప్రారంభిస్తున్న కమాండెంట్ అజిత వెజెండ్ల దంపతులు

**బుక్కరాయసముద్రం:** జంతలూరు సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో క్యాంటీన్‌ను కమాండెంట్ అజిత్ వెజెండ్ల, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ దంపతులు బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో బెటాలియన్‌లో మెస్ క్యాంటీన్‌తో పాటు ఎంటీ ఆఫీస్ ప్రారంభించినట్లు తెలిపారు. అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, డీఎస్పీ రమణమూర్తి, బెటాలియన్ యూనియన్ అధ్యక్షుడు పెద్దయ్య పాల్గొన్నారు.

### హుండీ మొత్తం అందజేత

**పామిడి:** మండలంలోని ఖాదర్‌పేట జడ్పీహైస్కూల్‌లో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో స్పందించు సాయం అందించు అన్న నినాదంతో అనాథ పిల్లలు ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.65086 పోగైనట్లు ఆ స్కూల్ హెచ్‌ఎం రాధాశ్రీదేవి బుధవారం తెలిపారు. ఆ డబ్బును సంస్థ డైరెక్టర్ జీ నారాయణరెడ్డి సమక్షంలో అందజేసినట్లు చెప్పారు.

### ముస్లింలకు ఇఫ్తార్ విందు

**యల్లనూరు:** మండల కేంద్రంలోని కొత్తపేట, పాతపేట మసీదుల్లో బుధవారం రంజాన్ మాసం నేపథ్యంలో 250 ముస్లింలకు జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జాఫర్, ముస్లింలు పాల్గొన్నారు.

### రాయలసీమ కర్తవ్య దీక్ష విజయవంతం చేయాలి

**తాడిపత్రి టౌన్ :** రాయలసీమ హక్కుల కోసం కర్నూలు ఎస్టీబీసీ మైదానంలో ఈనెల 24న జరగనున్న రాయలసీమ కర్తవ్య దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీమ కృష్ణానాయక్ ప్రజలను కోరారు. పట్టణంలో బుధవారం రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న కర్తవ్యదీక్ష కరపత్రాలను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్దేశ్వరం, సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలన్నారు. కర్ణాటక ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టును నిర్మించడంతో రాయలసీమకు తుంగభద్రనది నుంచి నికర జలాలు రావన్నారు. నాయకులు కమలాకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించండి

**యల్లనూరు:** ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం మొదలైందని ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీలో కూలీల హాజరు పెంచాలన్నారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, క్షేత్ర, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.